

భార్యాగ్రస్తులు
అజ్జరపు
హనుమంతరావు

సాయంత్రం నాలుగ్గం టలయింది....

పూర్ణగర్భిణిలా అపసోపాలు పడుతున్న పూరీ-హైద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ కదలడానికింకా రెండు నిముషాలు వ్యవధి వుంది.

"వెళ్ళగానే పెద్దాడిచేత వుత్తరం వేయించు పార్వతీ ..." ప్రకాశం గారి గొంతు జీరపోయింది.

"ఛీ! అదేవిఁటండీ! నాలుగు రోజుల భాగ్యానికే అంత యిదయితే ఎలా? వాడవసరం తీరగానే మళ్ళీ రెక్కలు గట్టుకుని వాలనూ?...." అంది. రైలు కిటికీ లోంచి పార్వతమ్మగారు భర్త బేలతనానికి జాలిపడుతూ; భర్త తనను గురించి బాధ పడుతున్నందుకు శరీరం లిప్తపాటు పులకించినా, మనసులో మాత్రం ఆవిడకీ ఒక ప్రక్క బాధగానే వుంది-భర్తని పదలి వెళుతున్నందుకు.

రైలు కూతేసింది.

"పార్వతీ! పెద్దవాడేం చెప్పినా కాదనకు." రైలుతోబాటు నాలు గడుగులు ముందుకు వేసి ప్రకాశంగారు ముక్తసరిగా అన్న ముక్కలవి!

ఆయ నామాట లెందుకన్నారో, వాటి సందర్భం ఏమిటో పార్వతమ్మగార్కి అర్థం కాలేదు. వేయాలనుకున్న ప్రశ్న ఆవిడ పెదవులు దాటకుండానే రైలు ప్లాటు ఫారం దాటింది.

గోదావరి బ్రిడ్జి మీదనుంచి భారంగా నడిచి వెళుతున్న రైలును కనుచూపుమేర దాకా చూపి, వెనుదిరిగారు ప్రకాశంగారు. బరువయిన ఆలోచనలతో భారంగా స్టేషను బయటి కొచ్చారాయన.

"రిక్షా బాబూ...." అంటూ ఒకరిద్దరు రిక్షాకాళ్ళు ముందు కొచ్చారు.

"వద్దు" అంటూ ముందుకు కదిలా రాయన.

ఇంటికి పోబుద్ధి పుట్టలేదాయనకి. భార్య లేని ఇంటికి వెళ్ళడం అంటే ఆయన కెంతో వెగటనిపించింది. నెమ్మదిగా మ్యునిసిపల్ పార్కులో కొచ్చి సిమెంట్ బెంచీ మీద కూర్చున్నారు.

జరిగినది తల్చుకున్నకొద్దీ ఆయన మనస్సు అవమానంతో దహించుకు పోసాగింది.

"ఛీ....వృద్ధాప్యం ఎంతటి జుగుప్సాకరమైనది! అందులోనూ ఆర్థిక స్వాతంత్ర్యము లేని తనలాంటి వాళ్ళ బ్రతుకు యింకా నికృష్టం! కడుపున పుట్టిన వాళ్ళే సాఫీగా సాగిపోతున్న తమ జీవితసరళిలో తుపాను సృష్టించినపుడు యిదేమిటని అడిగే వాక్ స్వాతంత్ర్యం లేని బ్రతుకు తన కెందుకు?" జరిగిన ఒక్కొక్క సంఘటన తల్చుకున్నకొద్దీ తన నిస్స

హేయ స్థితికి తన మీద తనకే జుగుప్స కలిగిందాయనకి.

'ఎంత ధైర్యంగా మాట్లాడాడు చిన్నాడు పొద్దున: అసలు వారం రోజుల బట్టి మొగుడు పెళ్ళాలిద్దరు గుసగుసలాడు కోడం చూసినప్పుడే అనుమానం వేసింది తనకి. కాని పెద్ద ప్రాధాన్యం యివ్వలేదు, తనప్పుడు. వ్యవహారం యింత త్వరలో యింత తీవ్రరూపం దాలుస్తుందని కలలో కూడ అనుకోలేదు తను....ఎంత సిగ్గు మాలినవాడు కాకపోతే, కన్నతండ్రితో "మిమ్మల్నిద్దర్ని పోషించడం కష్టం, చెరొక చోట వుండండి...." అని ఖచ్చితంగా శాసిస్తాడా? పార్వతి మాటలు వింటే వాడ్ని అక్కడికక్కడే దులిపేసి వుందును, కాని అది పురాణం వినడానికి వెళ్ళడంతో ఆ మాటలు వినే దుస్థితి తనొక్కడికే పట్టింది. అంతే!! అన్న రెండు మాటలు ముక్తసరిగా అనేసి యిక ముఖం చెల్లక వెళ్ళిపోయాడు. వాజమ్మ! పైగా. అన్నగారి కూడా తనే రాసి, యిద్దరూ చెరొక చోట వుండడానికి ఏర్పాటు చేశాట్ట! అయినా పెద్దాడికి మాత్రం బుద్ధి వుండక్కర్లా! తల్లిదండ్రులిద్దర్నీ చెరొకరు పంచుకుంటారా? యిద్దరూ ఒకచోట పడి వుంటే గుప్పెడు మెతుకులు పెట్టలేరూ?? తనిన్నాళ్లా పెద్దాడి మీద ఆశ పెట్టుకుని వుండేవాడు. హుఁ.... వాడి నిర్ణయం కూడా అదే అయినప్పుడు తను ఏ మాట అనీ ప్రయోజనం ఏవిఁటి? వెలితపడ్డం తప్ప! అందుకే జరిగినదాన్ని కప్పిపుచ్చి పార్వతిని పెద్దాడి దగ్గరకి ఏదో అవసరం వుందట రమ్మని రాశాడు. వెళ్ళిరా....' అని అబద్ధం చెప్పి పంపించాడు. అక్కడి కెళ్ళేక తెలుస్తుంది దానికి-యిక తాము యిద్దరూ శాశ్వతంగా వేరుగా వుండాలని!! ఏడుస్తుంది. యిద్దరి కొడుకుల్నీ తిట్టి పోస్తుంది, ఆ తర్వాత తనని కూడా తిడుతుంది - అబద్ధం చెప్పి పంపించి నందుకు. కావాలనే తను కూడా యిష్టపడి యీ పని చేశాడని మళ్ళి మళ్ళి ఏడుస్తుంది. కాని దానికేం తెలుసు! తన మనసులో ఎన్ని అగ్నిగోళాలు బ్రద్దలవుతున్నాయో'

ఆలోచిస్తున్న ప్రకాశం గారికి చెప్పలేని దుఃఖం వచ్చింది. 'ఈ వృద్ధాప్యంలో యీ ఎడబాటు ఎందుకు సృష్టించావ్ భగవాన్? ఏభయి సంవత్సరాలు సాఫీగాసాగిన తమ జీవిత సరళిలో అపస్మృతి యిప్పుడెందుకు పలికింది! నా పార్వతి నన్ను వదిలి వుండలేదు. 'నలుగు రోజుల ఖాగ్యానికే అంత బెంపేలుపడిపోతే ఎలా?' అని నాకు ధైర్యం చెప్పిన ఆ అమాయకురాల్ని శాశ్వతంగా వదలి వుండడం ఎలా? ఎలా?' మూగగా ఆక్రందించిందాయన మనస్సు, అప్రయత్నంగా రెండు కన్నీటి బొట్లు జల జలా రాలి పొక్కా మీద పడ్డాయి, కండువాతో వొత్తుతున్నారాయన.

"ఏడుస్తున్నావా ప్రకాశం...." ఆప్యా

యంతో నిండిన కంఠం.

ప్రకాశంగారి కొకప్పుడు అత్యంత పరిచయమైనది.

ఉలిక్కిపడి చుట్టూ చూశారాయన. ఆయనకి పది గజాల పరిధిలో ఎవరూలేరు చిరు చీకటి తప్ప, ఒక్కసారిగా ఆయన వొళ్ళు జలదరించింది ఎందుకో.

చల్లటిగాలి వీస్తున్నా చిరు చెమటలు క్రమ్ముతున్నాయాయన్ని.

"యిలా చూడు ప్రకాశం...." అదే కంఠం.

చటుక్కున ప్రక్కకి తిరిగారు ప్రకాశం గారు.

చుట్టు ప్రక్కల ప్రదేశం అంతా ఒక్కసారిగా నిశ్శబ్దమై పోయింది.

రేడియో సంగీతం, రోడ్డు మీద జనం తాలూకు గందరగోళం, కార్ల మోత అన్ని హఠాత్తుగా ఆగిపోయాయి. తనేదో నిర్జన మైన ప్రదేశానికి వెళ్ళిపోయినట్టు, ఏదో భయంకరమైన నిశ్శబ్దంలో ఒంటరిగా కూర్చున్నట్టు అనిపించిందాయనకి. ఒళ్ళు బరువెక్కింది.

అంతలోనే ఆయన కళ్ళ ముందు తెల్లటి దట్టమైన పొగ....ఆ పొగలో అస్పష్టంగా కనిపించిన ఆకారం క్రమంగా స్పష్టమై రూపుదాల్చి ఆయిన ముందు సాక్షాత్కరిందింది,

"అమ్మ!" అప్రయత్నంగా వణికా యాయన పెదవులు.

"ఎందుకురా ఏడుస్తావ్? ...... నువ్వు చేసిన నిర్వాకమే యీనాడు నీ పిల్లలు నీకు చేశారు."

గట్టిగా నవ్విందా ఆకారం. యిప్పుడా కంఠంలో యిందాకటి ఆప్యాయత లేదు. ఎత్తిపొడు స్తున్నట్టున్నాయా మాటలు.

"అమ్మా...." అంటూ గట్టిగా ఒక్క కేక వేశారు ప్రకాశంగారు.

అంతే! మరుక్షణం తెల్లటి పొగ, పొగతోబాటు ఆ ఆకారం మాయమై పోయింది;

చుట్టు ప్రక్కల గందరగోళం, రోడ్డు మీది కలకలం రేడియో సంగీతం అన్ని 'స్విచ్' ఆన్ చేసినట్టు మళ్ళీ ఆయన చుట్టూ ముసురుకున్నాయి శరీరం తేలిక పడింది. కాని మనస్సు పాతిక సంవత్స రాలు వెనక్కి పరుగులు తీసింది.

ఆనాటి సంఘటన....

హృదయ విదారకమైన సంఘటన.... మళ్ళీ యీనాడు తన విషయంలోనే అతి భయంకరమైందిగా, దుస్సహమైందిగా రూపు దాల్చింది,

ఆనాడు తను చేసిన పని ఎంత దారుణ మయిందో, అందుకా ముసలి ప్రాణాలు ఎంత క్షోభించాయో ఈనాడాయన స్వయ ముగా తెలుసుకున్నారు.

జరిగినదంతా సినిమా రీలులా ఆయన ముందు తిరిగింది....బండిలో కూర్చున్న తల్లి!

ఎర్రటి పట్టుచీర! ఆకుపచ్చ జాకెట్టు! ఐదవతనానికి నూటికి నూరుపాళ్లు ప్రా

నిధ్యం వహించేటట్టు కూర్చున్న తన మాతృమూర్తి!!

కంటికి మింటికి ఏకధారగా ఏడ్చింది.

"నాయనా ప్రకాశం! యిది మంచి పని కాదురా! యిక బతికినంత కాలం బతకం; మమ్మల్ని విడదీయకురా! అన్నయ్యని నే చెప్పిస్తాగా! మమ్మల్నిద్దర్ని ఒక చోట పడివుంటనీయండిరా....మా నాన్నకదూ" అని.

కాని తన మనస్సు కరగలేదు.

వీధి గుమ్మంలో శూన్యమనస్కుడై తన మనస్సు మారుతుందేమోనని ఎదురు చూస్తున్న తండ్రిని తనసలు పట్టించుకో లేదానాడు.

అది జరిగిన నెల్లాళ్ళకే....

"నాయనా ప్రకాశం! నీ తలిదండ్రుల్ని నువ్వు గౌరవిస్తేనే నిన్ను నీ పిల్లలు గౌరవిస్తారు, వీళ్ళని నువ్వు ఏవగించుకుని దూరం చేసుకుంటే నీ పిల్లలు నీకు చేసే దదే! ఇది కఠిన సత్యం...." అంటూ శాశ్వతంగా కళ్ళు మూశాడు తండ్రి, ఆయన దినవారాలు పూర్తి కాకుండానే తల్లి కూడా ఆయన్ని చేరుకుని, తన ఆదర్శ సతీత్వాన్ని నిరూపించుకుంది.

.... .... .... .... ....

ఒక్కసారిగా నిట్టూర్చారు ప్రకాశం గారు. పూర్తిగా మైకం వొదిలి పోయింది ప్పుడాయనకి.

అవును: అదే నిజం!! జరగవలసిందే అక్షరాలా జరిగింది, 'పార్వతీ! చూశావా!' అనాడు నువ్వే నన్ను వారించి వుంటే యీనాడిలా జరిగి వుండేది కాదేమో!? ఆ దంపతుల శాపనానికి గురయిన మనని దేవుడు కూడా రక్షించలేడు.

....అనుభవించాల్సిందే! బాధపడకు! పడటం అవసరం, నిష్ప్రయోజనంకూడా.

గొణుక్కుంటూ లేచి తడబడే అడుగులతో గృహోన్ముఖులయ్యారు, ప్రకాశం గారు.

---

## పట్టి తిట్టులు :-

"సున్నకి సున్న చేరిస్తే ఏమవుతుందోయ్?"

"రెండు సున్నలు."

"కాదు సున్నం."

"పది మధ్య సున్న పెడితే."

"పంది."

"ఛ. తిట్టుగాస్తా, తగలేసావు. నువు వందఅనుండాలి. నేను పంది అనుండాలి"